

# సారీ ఆంధ్రాకవి

సుబ్బారావు కాళ్ళు ఆగిపోయాయి. ముంగుకు పోనని మొరాయించాయి. అది పట్టణంలోని ఓ ప్రముఖ హాలు. అందులో నాటకాలు - సభలు గట్రా జరుగుతూ ఉంటాయి. అలా నడుచుకుంటూ పోతున్నప్పుడు రోడ్డుమీంచి ఆ హాలు కాంపౌండులోకి తొంగి చూడ్డం సుబ్బారావుకు అలవాటు.

అక్కడ ఓ బ్యానరు కనిపించింది పెద్ద పెద్ద అక్షరాలతో

'మంచులో సుందరి' కవితా సంకలనం ఆవిష్కరణ.

ఆవిష్కర్త ఎవరై ఉంటారని చూసిన అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. ప్రముఖ క్రికెటర్ డకౌట్ డబ్బారావు ఆ సభకు విచ్చేసి ఆ గ్రంథాన్ని ఆవిష్కరిస్తాడట !

'ఓహో ! ఎలాగూ నేషనల్ టీమ్‌లో సెలక్టు కాలేక పోయాడు గదా - ఇలా సమయాన్ని సద్వినియోగం చేస్తున్నాడన్న మాట' అని అనుకున్నాడు.

టైం చూసుకున్నాడు ఆరున్నర - ఇంట్లో ఎవ్వరూ లేరు. తన కొలీగు పెళ్ళికి వెళ్ళింది అప్పల నరసమ్మ. హోటల్లో భోంచేసి ఇల్లు చేరుకోవాలి. ముందు సినిమాకు పోదామనుకున్నాడు. రేట్లు గుర్తుకొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఎలాగూ ఓ నెల రోజుల్లో ఏదో ఒక ఛానెల్లో ఆ సినిమా ప్రసారం కాకపోదు. అప్పుడు ఫ్రీగా చూడచ్చు అనుకున్నాడు.

అన్నట్లు సుబ్బారావుకు ఫ్రీగా ఫినాయిల్ వస్తే తాగే అలవాటుంది.

అందుకని సమయాన్ని ఎలా చంపాలా? అనే ఆలోచనలతో చచ్చి పోతున్న సుబ్బారావుకు గ్రంథావిష్కరణ సభ ఒక వరంలా తోచింది.

గ్రంథం ఏమన్నా కాని గ్రంథసాంగుడైన డకౌట్ డబ్బారావుని చూసే అవకాశమొచ్చిందని లోపలికి నడిచాడు. ఓర్నాయనో ! ఆంధ్రులకు కవిత్వం పట్ల ఇంత పిచ్చి ఎప్పుడు పెరిగిందని ఆశ్చర్యపోయాడు.

ఇంతలో బ్యాట్ పట్టుకుని డబ్బారావు వస్తూ కనిపించాడు.

కన్వీనరు హడావిడిగా ప్రముఖులను వేదిక మీదకు ఆహ్వానించడం మొదలెట్టాడు.

ఇంతలో విలేఖరులు డకౌట్ డబ్బారావును చుట్టు ముట్టారు.

" మీరు క్లిష్టమైన సమయాల్లో సున్నాకు వెనక్కు తిరుగుతూ ఉంటారు? అందులో

ప్రత్యేకత ఏమిటి?" ఓ విలేఖరి అడిగాడు.

" అందరూ సెంచరీలు కొడుతున్నప్పుడు - మీరు కూడ సెంచరీ బాదుతూ ఉంటారు. కారణం కనుక్కోవచ్చా?" ఇంకో విలేఖరి ప్రశ్న.

" ఇండియన్ టీమ్ బాగుపడుతుందా? రాబోయే వరల్డు కప్ మనం కొట్టగలమా?" ఇంకో అభిమాని అడిగాడు.

" అయ్యా ! మీ అభిమానానికి కృతజ్ఞతలు! ఇవన్నీ మన జోకర్లను అడగాల్సిన ప్రశ్నలు ట్యాలెంటును పక్కకు పెట్టి - ప్రాంతీయాభిమానాలు చూపించి - అయిన వారిని సంతృప్తి పరిచే గొప్ప మనసు మనవారిది. ఇక పోతే వరుసగా సెంచరీలు కొట్టి సెలక్టర్లను ఇబ్బంది పెట్టడం నాకిష్టం ఉండదు. నన్ను టీమ్‌లోంచి తప్పించాలంటే వారికో కారణం చూపించాలి గదా! పైగా నా సీనియర్లు అంతా డకౌట్ అవుతూ ఉంటే నేను పెద్ద హీరోలాగా ఆడితే బాగుండదు. అందుకే వారి స్ఫూర్తితోనే జీరోకే సరిపెట్టుకుంటాను" చెప్పాడు గ్రేట్ క్రికెటర్ డి.ఎ.డి.బి.బి. ఎ.రావు.

" మీ డకౌట్ వరల్డు రికార్డు ఎవరైనా బీట్ చేస్తారంటారా?"

" చాలా కష్టమండి. ఎంతో కష్టపడి వరుసగా ఏడు ఇంటర్‌నేషనల్ మ్యాచుల్లో డకౌట్ సాధించాను. అందుకు మన బోర్డుకు నా కృతజ్ఞతలు. అంత సహృదయత వేరే దేశాల్లో కనపడదు. ఒక్క డకౌట్‌కే నెక్స్టు మ్యాచ్‌లోంచి తీసేస్తారు" సిగ్గు పడుతూ చెప్పాడు

" మళ్ళీ ఇండియన్ టీమ్‌లోకి ప్రవేశిస్తారా?" ఒక అభిమాని అడిగాడు.

" నాపైన చాలా ప్రెజర్ ఉందండి. అన్ని దేశాల వాళ్ళు వెంటనే చేరమని నాపైన వత్తిడి తెస్తున్నారు. నాలోటు తీర్చలేనిదని విదేశీయులంతా ఏక కంఠంగా చెబుతున్నారు. ఆ చెప్పేదేదో మన సెలక్టర్లకు చెబితే చేరాలనే ఉంది. ఈ విరామంలో చాలా ప్రాక్టీసు చేశాను, మొదటి బంతికే క్లీను బౌల్డు ఎలా కావచ్చుని - లేదా - ఎలా క్యాచ్ యివ్వచ్చుని! నా కృషి ఊరికే పోదు" వినయంగా చెప్పాడు డబ్బారావు.

" ఈ గ్రంథానికీ మీకూ సంబంధం ఏమిటి?"

" కవిగారు నా క్లాసుమేటు. ఇద్దరం కల్సి క్రికెట్ ఆడేవాళ్ళం స్కూలు దేసులో. అప్పుడప్పుడు వాడు నన్ను ఔట్ చేస్తూ ఉండేవాడు."

ఇంతలో డబ్బారావును వేదిక మీదకు రావల్సిందిగా నిర్వాహకులు ఆహ్వానించారు. డకౌట్ డబ్బారావు క్రికెట్ బ్యాట్ గాల్లోకి ఊపి అందరికి అభివాదం చేసి - బ్యాట్‌ను టేబులు మీద పెట్టి కూర్చున్నాడు.

సుబ్బారావు వేదికని అధిరోహించిన పెద్దల నందరిని శ్రద్ధగా గమనించాడు. అందరూ వివిధ రంగాలలో నిష్ణాతులే ! కాని కవిమటుకు అతను ఒక్కడే ! అదే అతను, 'మంచులో

సుందరి' రచించిన అరగుండు అప్పారావు. వేదిక మీద పదిమంది దాకా ఆశీనులై ఉన్నారు. వారిముందు అందమైన రిబ్బనుతో కట్టిన ఒకమూట ఉంది. కవిగారి గ్రంథాలు అయి ఉంటాయి. అధ్యక్షులు అంజయ్య లేచి మైకు అందుకున్నాడు-మానవులలో కూడ అసురులుంటారు.

-ముఖ్యంగా మైకాసురులు-నిర్దాక్షిణ్యంగా ఎదుటివారిని వాయించి వదిలి పెట్టడమే వారిపని.

అంజయ్య చిన్నప్పుడు ఆవు వ్యాసం బాగా బట్టీ పట్టాడు. ఏ టాపిక్ మీదనైనా ఉపన్యాసాలు యివ్వగలడు, ముందు వెనుకలు కొంచెం మార్చి. ఏ సందర్భానికైనా సరిపోయే ఉపన్యాసం అతని మెదడులో నిక్షిప్తమై పోయి ఉంది.

కవి గురించి రెండు ముక్కలు చెప్పాడో లేదో - ఇంక అంజయ్య తన ధోరణిలో పడిపోయాడు, పాడిందే పాడరా పాచి పళ్ళ దాసరి చందాన.

" తెలుగువాడు ఎక్కడున్నా సరే తెలుగే మాట్లాడాలి. ఈ విషయంలో మనం అరవ వాళ్ళను - బెంగాలీలను చూసి ఎంతైనా నేర్చుకోవాలి. వారి భాషలో మాట్లాడంది వారసలు పెదాలు విప్పరు. కాని తెలుగాడు మటుకు తెలుగు మాట్లాడ్డం నామోషిగా భావిస్తాడు. ఎక్కడి కెళ్ళినా ఆ ప్రాంత భాషనే మాట్లాడతాడు.

ఈ మధ్యనే గమనించిందేమంటే ఇంగ్లీషు దెబ్బకు మన తేట తెనుగు ముక్కలు చెక్కలు అవుతున్నది. పట్టుమని పది మాటలు కూడ ఇంగ్లీషు పదాలు వాడకుండా తెలుగు మాట్లాడలేక పోతున్నారు చాలామంది. ఆఖరికి గ్రామాల్లో కూడ ఇంగ్లీషు వాడకం ఎక్కువై పోయింది. ఎక్కడ చూసినా బోర్డులు ఇంగ్లీషులో కనిపిస్తున్నాయి.

ఆఖరికి వ్యవహారాలు కూడా ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి. ఇది మన బానిస సంస్కృతికి గుర్తు. ఇంగ్లీషు వాళ్ళు మనల్ని వదిలి పెట్టి అరవై సంవత్సరాలు కావస్తున్నా - మనం మటుకు వారి భాషను నెత్తిమీద పెట్టుకుని కొలుస్తున్నాం.

ఏం ? మనకంటూ ఓ సంస్కృతి లేదా? ఓ భాష లేదా? ఓ వేషధారణ లేదా? ఏంటా ఇంగ్లీషు గొప్ప ?"

ఇలా సాగిపోతున్నది అధ్యక్షులు అంజయ్యగారి వాక్ ప్రవాహం.

కవిగారు దగ్గారు - చిన్న కాగితం రాసి పంపించారు. జుత్తు పీక్కున్నారు. అసలే అరగుండు - ఉపన్యాసం పూర్తి అయ్యేలోగా అది కాస్తా పూర్తి గుండు అవుతుందేమో! అయినా అంజయ్య ధోరణి ఆగలేదు. అది తెలుగు భాషా వికాస సభ అనుకుంటున్నాడు అంజయ్య.

" ముఖ్యంగా యిప్పుడు 'మమ్మీ డాడీ' సంస్కృతి విజృంభిస్తున్నది. పిల్లలతో 'నాన్నా-

అమ్మా' అని పిలిపించుకోవడానికి సిగ్గు పడుతున్నాం. తెలుగు నేర్పే బదులు కాకుండా - పుట్టగానే పసి పాపల్ని కాన్వెంట్లలో పడేస్తున్నాం- వాళ్ళు మాట్లాడే ఎంగిలి ఇంగ్లీషు మాటలు విని మురిసిపోతున్నాం- ఈ మధ్యకాలంలో డిగ్రీ పాసయిన వాళ్ళు తెలుగులో మాట్లాడ్డం అన్ కల్చర్డుగా భావిస్తున్నారు. ఎందుకీ భావ దారిద్ర్యం? ఇది ఎప్పుడు పోతుంది?" అధ్యక్షులు అంజయ్య అలా ఆక్రోషించి తదుపరి వక్తను పిల్చారు.

కార్యదర్శి కర్రా నరసింహులు తన ఉపన్యాసం మొదలెట్టాడు. "అంజయ్య చెప్పినట్లు మనం తెలుగు భాషా వికాసానికి బాగా కృషి చెయ్యాలి. తెలుగు పదం తప్ప ఇతర భాషలు మాట్లాడకుండా ఉండటానికి ట్రై చెయ్యాలి. ఇంగ్లీషు పదాలు మాట్లాడకూడదని గట్టి డెసిషన్ తీసుకుని - దాన్ని ఇంప్లిమెంటు చెయ్యాలి. మీరు అలా మాకు ప్రామిస్ చెయ్యాలి మిస్సు కాకుండా.

ఇంగ్లీషు లేంది అభివృద్ధి లేదని చాలా మందికి అపోహ ఉంది. ఉదాహరణకు సోవియట్ రష్యా ఆంగ్లేయుల ప్రభావం లేకుండానే తమ రష్యన్ భాషలో ఎన్నో శాస్త్రాలను అభివృద్ధి చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో దేశాలు తమ మాతృ భాషలోనే డెవలప్ అయ్యాయి.

కాని ఆంధ్రులు మటుకు తమ మాతృభాషని మృతభాష చేస్తున్నారు. ఇది కండెమ్ చెయ్యాల్సిన మేటరు. ఎవరికైనా మదర్‌టంగ్ చాలా ఇంపార్టెంట్ ! మమ్మీ డాడీ అని పిలిపించుకునే తల్లిదండ్రుల్ని బ్యాన్ చెయ్యాలి."

ఇలా వీరావేశంతో కార్యదర్శి కర్రా నరసింహులు తెలుగును నరికేశాడు.

ఇంతలో సభలో కలకలం చెలరేగింది. కొందరు పెద్దగా అరిచారు. డకౌట్ డబ్బారావు మాట్లాడితే మేం వెళ్ళిపోతాం- కావాలంటే మీరు మీ ఉపన్యాసాల్ని తరువాత యివ్వండి." అంటూ పెద్ద గలభా లేచింది.

దాంతో అధ్యక్షులు ముందుగా డబ్బారావును పుస్తకావిష్కరణ చేయమన్నాడు కార్యదర్శి కత్తెర సిద్ధం చేశాడు. డబ్బారావు దాన్ని తిరస్కరించాడు.

" ఈ బుక్ ఇనాగ్యురేషన్ వైరటీగా చేస్తాను. అరగుండు అప్పారావును ఆ పుస్తకాల మూటను నాపై బౌల్ చేయమని అడుగుతున్నాను".

సభలో నిశబ్దం ఆవరించింది. తమకెవరికీ తట్టని కొంగ్రొత్త ఆలోచన ఆఫ్టరాల్ ఓ క్రికెటరుకు తట్టినందుకు వేదిక మీద ఆసీనులైన పెద్దలు ఖిన్నులయ్యారు.

డబ్బారావు కోరిక మీద కవి అప్పారావు తన పుస్తకాల మూటను బౌలింగు చేస్తున్నట్లు గాల్లోకి విసిరాడు.

అంతే ! డకౌట్ డబ్బారావు తన బ్యాట్‌ను ఝుళిపించాడు.

ఆ మూట మీద ఓ సిక్సర్ బాదాడు.


నేను "SAVE EARTH" అని రాయమన్నా
ఆర్టిస్టూ !!?
SALE EARTH
-AVM


సార్-- మీ పని మీదే వున్నారు! దొంగల్ని ఎలా
పట్టుకోవాలో ఆ సినిమాలో బాగా చూపెడుతున్నారు!
మీ నగలన్నీ
క్రైమ్ బ్రాంచ్
-AVM


నేను కోలుకోగానే
ముఖ్యమంత్రికి!
ప్రధానమంత్రికి!
సపోర్టిస్తా!!
AVM

అంతే ! ఆ మూట బోయి ఫ్యాన్ రెక్కలకు తగిలింది. రిబ్బను ముడి తెగి కవి గారి గ్రంథాలు అన్నీ ఆకాశం నుండి పూలు రాలినట్లుగా వేదిక మీదకు చెల్లాచెదురుగా పడ్డాయి. వీడియో కెమెరాలు - డిజిటల్ కెమెరాలు - ఫ్లాష్ కెమెరాలు క్లిక్ క్లిక్ క్లిక్ అని అదృశ్యాన్ని రికార్డు చేసుకున్నాయి.

" ఇప్పుడు గ్రంథం గురించి-అదే-' మంచులో సుందరి' గురించి బహిష్కర్త - సారీ - ఆవిష్కర్త - సారీ ఆవిష్కర్త డబ్బారావు గారు పరిచయం చేస్తారు". అని అంజయ్య ప్రకటించారు.

డకౌట్ డబ్బారావు బ్యాట్‌ను చంకలో పెట్టుకుని లేచి మైకు దగ్గరికి నడిచాడు. పుస్తకాన్ని బ్యాట్ పట్టుకున్నట్లు పట్టుకున్నాడు.

సభలో చప్పట్లు మారుమ్రోగాయి.

డబ్బారావు మైకు ముందు నిల్చుని గొంతు సవరించుకుంటున్నాడు మైకు ముందు చిటికెలు వేశాడు. బ్యాట్‌ను అటూ యిటూ ఆడించాడు.

కొన్ని నిమిషాలు గడిచిపోయాయి.

కాని అతని నోటినుండి ఒక్కమాట కూడ బయటకు రాలేదు.

పిచ్‌ని పరిశీలిస్తున్నట్లు సభంతా కలయ చూస్తున్నాడు పక్కకు తప్పుకో మన్నట్లు.

"డబ్బారావు స్పీకాలి !" అని గలభా జరుగుతున్నది సభలో.

ఎట్లాగయినా బాల్యమిత్రుడు కాబట్టి అరగుండు అప్పారావు అతని స్టారింగ్ ట్రబుల్‌ని కనిపెట్టాడు.

లేచి అతని దగ్గరికి వెళ్ళి జేబులోంచి ఒక కాయిన్ తీసి అడిగాడు.

" బొమ్మా ? బొరుసా ? " అని

" అమ్మా ! నాకు బొమ్మ " అన్నాడు డబ్బారావు.

అప్పారావు టాసు వేశాడు. అది ఫ్యానుకు తగిలి ఎక్కడో పడిపోయింది.

ఇంకో కాయిన్ తీసి మళ్ళీ వేశాడు.

బొమ్మ పడింది.

" బ్యాటింగు మాది." అన్నాడు డబ్బారావు.

డబ్బారావు భార్య ప్రేక్షకుల్లోంచి గాల్లోకి చేతులూపింది.

అప్పుడు డకౌట్ డబ్బారావు స్పీకడం మొదలెట్టాడు.

" నా పేరు డి.రావు - కాని నేను మీకు డకౌట్ డబ్బారావు గానే తెలుసు. డకౌట్ అన్న బిరుదును నేను నోబుల్ ప్రైజు కంటే ఎక్కువగా భావిస్తాను. అది నేను కష్టపడి సాధించింది. మా నాన్నకు డబ్బు పిచ్చి. అందుకే తనకు పుట్టిన మొదటి సంతానానికి

డబ్బులరావు అని పెట్టుకున్నాడు. అది కాస్తా మా క్లాసు టీచరు రిజిష్టరులో పొరపాటున డబ్బారావుగా రాసింది. అది అలానే ప్రసిద్ధమై పోయింది. దాన్ని మార్చుకోవాలన్నా సాధ్యం కాదు. ఇక్కడ నా గురించి - నా ఘనచరిత్ర గురించి చెబితే నా ఫ్రెండు అరగుండు అప్పారావు బాధపడతాడు. కాబట్టి నాకు తెల్సిన నాలుగు ముక్కలు చెబుతాను.

అప్పారావు చిన్నప్పటి నుండి అంతే ! అర్థం గాని పిచ్చిరాతలు రాస్తూ ఉండేవాడు. టీచరు ఒకటి చెబితే ఇంకోటి నోట్సులో రాసుకునేవాడు. ఏదీ సవ్యంగా వినేవాడు కాదు. ప్రతిదానికి పెడర్థాలు తీసేవాడు. కుక్కలు మొరుగుతున్నా - గాడిదలు ఓండ్రిస్తున్నా అమిత ఆనందం అనుభవించే వాడు. దున్నపోతులా ట్రాఫిక్కుకు అడ్డంగా నిల్చుని ఏవో కూనిరాగాలు తీస్తూ ఉండేవాడు.

మొదట్లో వాళ్ళ నాన్న ఇతనికేమన్నా గ్రహం పట్టిందేమోనని భూతవైద్యం చేయించాడు- తగ్గలేదు- తరువాత సైక్రియాటిస్టులకు చూపించాడు. ఇతని మూలంగా అక్కడి పేషంట్లు చెడిపోవడంతో - ఆ పిచ్చి డాక్టరు ఇతన్ని బయటకు గెంతేశాడు. ఆ తరువాత నేను ఇతగాడ్ని గ్రౌండుకు తీసుకు పోయి క్రికెట్ ప్రాక్టీసు చేయించాను. అద్భుతంగా బౌల్ చేసేవాడు. కాకపోతే బ్యాట్ ఉన్నవైపు కాకుండా - అందమైన అమ్మాయిలున్న వైపు బౌల్ చేసేవాడు. అందుకని వాళ్ళనే మాకు అనుకూలంగా కూర్చోబెట్టుకునే వాళ్ళం.

రాత్రిళ్ళు లేచి కేకలు పెట్టేవాడు...

ఇవన్నీ చూసి వాళ్ళ వాళ్ళు వీడిపైన ఆశలు వదులుకున్నారు.

ఈ మధ్యే నాకు తెల్సింది వీడు కవిగా రాటు తేలాడని.

మంచులో సుందరి అన్న పేరులోనే ఎంతో భావుకత ఉంది. సినిమాల్లో వర్షంలో తడిసిన సుందరిని చూపిస్తారు, కాని మన కవి మంచులో తడిసిన ముగ్ధను చూపుతున్నాడు. అట్టమీద అటు చలి - ఇటు చెలి - అందుకుంటే వెచ్చని కౌగిలి- చదివే పాఠకుల్లో చక్కిలి గిలి రగులుతుంది. ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

చాలా మంది సామాజిక స్పృహ అంటూ కరువు, ఆకలి, దోపిడీలు- మానభంగాల మీద కవిత్వం కక్కుతారు. కాని మా అరగుండు అప్పారావు స్త్రీమీద ఆమె ఒంపు సొంపుల మీద ఇంపుగా కావ్యం రాశాడు. ఇది ప్రతొక్కరు కొని చదవాలని నా ఆకాంక్ష! ఎంతో ఖరీదు లేదు. కేవలం ముప్ఫయి రూపాయలే ! మీరు మందు కొట్టడానికి అంతకంటే ఎక్కువ ఖర్చు పెడతారు.. మీలో ఎంత మంది కొంటారో చేతులెత్తండి.." అంటూ డబ్బారావు ఆపాడు.

సభ నిశ్శబ్దం అయిపోయింది. ఒక్కళ్ళు కూడ ఎత్తలేదు.

అప్పారావు నివ్వెర పోయాడు, తనకు చాలా కావల్సిన వాళ్ళు ఉన్నారు. వాళ్ళందరికి

ఈ 'మంచులో సుందరి' ప్రింటు అయ్యేలోగా ఎన్నోసార్లు డిన్నర్లు, పార్టీలు యిచ్చాడు - వాళ్ళే

దీన్ని అచ్చేయించమని ప్రోత్సహించింది. ఓ ఇరవై వేలు ఖర్చు పెట్టింది వాళ్ళంతా కొంటారనే! కాని ఒక్కడంటే ఒక్కడు కొనడానికి ముందుకు రాలేదు.

" పోనీ ఉచితంగా యిస్తే చదివే వాళ్ళు ఎంత మంది?" డబ్బారావు అడిగాడు. ఓ పాతిక చేతులు లేచాయి.

" సరే, ఉచితంగా యిస్తే తీసుకునే వాళ్ళు ఎంత మంది?" మళ్ళీ అడిగాడు. దాదాపు సభికులంతా చేతులెత్తారు.

" నాకాశ్చర్యంగా ఉంది. ఉచితంగా చదవమంటే కొందరే ఎత్తారు. కాని ఉచితంగా తీసుకోమంటే అందరూ ఎత్తుతున్నారు. మరి మీరంతా తీసుకుని ఏం చేస్తారు?" ఆశ్చర్యంగా అడిగాడు డబ్బారావు.

" నాకు కిరాణా వ్యాపారం ఉంది - పొట్లాలకు పనికి వస్తుంది" ఓ మధ్య వయస్కుడు లేచి చెప్పాడు.

" నా లవర్‌కు ప్రజెంట్ చేస్తాను అతని బర్త్‌డేనాడు." ఓ కాలేజి గరల్ చెప్పింది.

" మా పిల్లలు స్కూలు పుస్తకాలు చింపి పడవలు చేస్తూ ఉంటారు... దాని బదులు ఇది పనికి వస్తుంది" ఓ గృహిణి చెప్పింది.

" కసువు కొట్టడానికి కాయితాలు కావాలి - ఆ కసువును ఎత్తి బయట పొయ్యటానికి పనికి వస్తుంది." ఓ ముసలామె చెప్పింది.

" థ్యాంక్స్ ! తన కవిత్వంతో యిన్ని ఉపయోగాలున్నాయని ఆ రాసిన అరగుండు అప్పారావుకు కూడ తెలియదు. మీ ఇన్నోవేటివ్ ఐడియాలకు చాలా సంతోషం ! నా ఉపయోగం కూడ చెబుతాను ఈ మంచులో సుందరిని జేబులో పెట్టుకుని బ్యాటింగు దిగాననుకోండి... ఎప్పుడు ఔట్ కావాలనుకుంటే అప్పుడు ఒక్కసారి అట్టమీద సుందరిని చూస్తే చాలు." అంటూ కూర్చున్నాడు డకౌట్ డబ్బారావు.

" ఉపన్యాసకులకు చిన్న మనవి ! స్వచ్ఛమైన తెలుగు మాట్లాడండి ఇంగ్లీషు పదాలు వాడద్దు." అంటూ అధ్యక్షులు ముందుగా కవిగార్ని ఉపన్యాసం యిమ్మని కోరాడు.

అరగుండు అప్పారావు ఒక చేత్తో గుండును - యింకో చేత్తో గుండీని తిప్పుతూ తన ఉపన్యాసం మొదలెట్టాడు.

" నా మిత్రుడు డబ్బారావు నా బుక్‌ను ఇనాగురేట్ చేసినందుకు థ్యాంక్సు ! కాని మీలో ఒక్కరు కూడ నా బుక్కు కొనడానికి ఫార్వర్డ్ కానందుకు రిగ్రెట్సు ! చిన్న కన్ఫెషన్ యిస్తున్నాను- ఎవరైతే కొంటారో వారి కాపీలలో నేను ఆటో గ్రాఫు చేస్తాను-సరేనా -


లోక్‌పాల్ బిల్లు పవర్
లోకి వచ్చేలోపు గా
డబ్బు బాగా
వెనకేయండి!!
మంత్రి
AVM


మాకెలాగూ పదవి రాదు! కాని
పదవిలో వున్నవాళ్ళు దిగేదాకా
పోరాడుతాం!!
AVM


అల్లావుద్దీన అద్భుత దీపం నాకు దొరికింది కాని
సుఖం లేదు!
ఆ భూతానికి
ఆకలి తీరితేగాని
వరాలివ్వలేట్టు!
నన్ను తింటే
గాని!!
ఆకలి
తీరదంట!!
AVM

ఎంత మందికి కావాలి! ఇంకోటి ఈ రోజు ఫిఫ్టీ పర్సెంటు డిస్కౌంటు కూడ యిస్తున్నాను." కవిగారు చెప్పాడు.

అయినా సభలో చలనం రాలేదు. అందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుంటున్నారు.

"ఈ కవితలన్నీ ప్రముఖ పత్రికల్లో పడినవే ! గొప్ప గొప్ప విమర్శకులు మెచ్చుకున్నవే! ఆంధ్రకవి దురదృష్టం ఏమంటే తను అచ్చేసుకున్న అయిదు వందల కాపీలను కూడ అయిదు దశాబ్దాలలో అమ్ముకో లేక పోతున్నాడు. అదే పొరుగు రాష్ట్రాలలో, కేరళ లాంటి చోట్ల, సంవత్సరానికి ఇరవైవేల కాపీలను కూడ ఈజీగా సేల్ చేసుకో గలుగుతున్నాడు-మన వాళ్ళకు మాతృభాష మీద ప్రేమ లేదు." వాపోయాడు అరగుండు అప్పారావు ప్రేక్షకుల ఉదాశీనత్వానికి.

"కాదు - కాదు మాతృభాష మీద ప్రేమ ఉండబట్టే మీ గ్రంథం కొనడం లేదు." అని అరిచాడు సుబ్బారావు ప్రేక్షకుల్లోంచి.

విస్తుపోయాడు అధ్యక్షులు!

కార్యదర్శి కర్రా నరసింహులు అతన్ని వేదిక మీదకు ఆహ్వానించి ఇంకో మైకు అందించాడు మాట్లాడమని.

"డియర్ ఫ్రండ్సు - వాటై సే ఈజ్ !" అంటూ ప్రారంభించాడు సుబ్బారావు.

"నో ఇంగ్లీషు - టాకిన్ తెల్గు !" కార్యదర్శి కోప్పడ్డాడు.

"వుయ్ డోంట్ అలౌ ఇంగ్లీషు టెల్లేది ఉంటే తెలుగులోనే టెల్సు !" అధ్యక్షుడు అంజయ్య అరిచాడు ఉద్రేకంతో.

"ఓకే ! అయామ్ సుబ్బారావు ఫ్రం ఆంధ్ర ! నాకు ప్రాంతీయ భేదాలు లేవు కాబట్టి - ఆంధ్రా అని చెప్పాను. తెలంగాణా వాడ్ని - రాయలసీమ వాడ్ని - సర్కారు వాడ్ని అని చెప్పలేదు." అంటూ విజృంభించబోయాడు.

"కమ్ టు ది పాయింటు - మాతృభాష మీద గౌరవం ఎక్కడికి పోయింది?" సభను అలంకరించిన ఓ పెద్ద తలకాయ అడిగింది.

"సార్ ! ఈ కవిత్వాలు గట్రా చూస్తే నాకు ఒళ్ళు మండుతుంది. దాంట్లో ఏముంటున్నది సార్. నిజమైన కవిత్వం ఉంటున్నదా? పాండిత్య ప్రగల్భాలు - కపిత్వం తప్ప. కొండకచో కుపిత్వం కూడ ఉంటున్నది. చక్కటి చిక్కటి తెలుగు పదాలను క్రూరంగా విడగొట్టి - రకరకాల ప్రయోగాలు చేసి బుర్ర పాడు చేస్తున్నారు. కొత్తదనం కోసం మాటలతో కసరత్తు చేస్తున్నారు. నిత్యం మాట్లాడుకునే పదాలతో కవిత్వం రాయకుండా కొన్ని వందల క్రిందట మృగ్యమైన పదాలను డిక్షనరీల్లోంచి వెతికి పట్టుకుని గుప్పిస్తున్నారు. ఆఖరికి పేర్లను

కూడ క్లిష్టంగా అర్థం గాకుండా పెడుతున్నారు. అందుకే నాకు కవులన్నా - రచయితలన్నా భయం పట్టుకుంది. చదవడం తగ్గించేశాను. ఐ హేట్ రీడింగ్ తెల్గు."

" కాని సుబ్బారావు థ్రం ఆంధ్రా ! మాతృభాష మీద ప్రేమ లేక పోతే ఎలాగయ్యా ! ఈ మమ్మి డాడీ సంస్కృతిని నాశనం చెయ్యాలి. ఈ ఇంగ్లీషు నుండి మన భాషను రక్షించుకోవాలి..." అంజయ్య ఆవేదన చూపాడు.

" హౌ ఈజిట్ పాజిబుల్ ! ఫ్రండ్సు ! ఒక్కటి అడుగుతున్నాను - మీలో ఎంత మంది పిల్లలు లేదా బంధువులు అమెరికాలో ఉన్నారో చేతులెత్తండి."

దాదాపు పాతిక వంతు ప్రజలు చేతులెత్తారు. అందులో అంజయ్య కూడ ఉన్నాడు - కర్రా నరసింహులు కూడ ఉన్నాడు.

" మన పిల్లలకు మనం చదివించేది కాన్వెంటు చదువులు, చెప్పించేది బిటెక్ చదువులు అయిపోగానే కలలు కనేది అమెరికాకు పంపాలని - అక్కడ నుండి దాలర్లు దండుకోవాలని - వీలైతే మనం కూడ జాలీ ట్రిప్ పోయిరావాలని - అటువంటప్పుడు ఇంగ్లీషు ఎలా అడ్డుకోగలం - ఏ కాలంలోనైనా రాజభాషకు నీరాజనం తప్పదు. ఒకప్పుడు సంస్కృతం మన రాజభాష - అందుకే తెలుగులో అత్యధికంగా సంస్కృత పదాలు చేరాయి - కొన్ని దశాబ్దాల క్రిందటి దాకా ఇంగ్లీషు రాజ్యమేలింది. అందుకే రైలు బస్సులాంటి ఆంగ్ల పదాలు మన భాషలోకి వచ్చేశాయి. కొన్ని పదాలకు సరియైన తెలుగు పదం ఎవరు చెప్పగలరు? కంప్యూటరుకు, రైలుకు, సెల్‌కు అర్థమయ్యే చక్కటి జాను తెలుగు పదాలు ఎవరైనా చెప్పగలరా? ఆఖరికి ఆంధ్రభాషా ఉద్ధరణకు నడుం బిగించిన అంజయ్య గారు కూడా చెప్పలేరు. మీరు వేసుకునే డ్రస్సు - చూసే టీవీ దగ్గర నుండి ఇంగ్లీషు వాడి ప్రభావం ఉంది. ఆఖరికి తీసుకునే మందు కూడా వాడిదే ! తినే తిండిలో కలిపే ఏరువులు కూడా వాడివే ! అందుకని దాన్ని గురించి విచారించడం అవివేకం - అప్రస్తుతం -" సుబ్బారావు చెప్పుకొచ్చాడు. సభ నిశ్శబ్ద మైంది.

" అయ్యా ! ఇంతకూ తమరన్నా నా గ్రంథం కొంటారా?" కవి అడిగాడు.

" ఒక చిన్న పని చేస్తే నేను కాని - నాతో పాటు చాలా మంది కాని నీ పుస్తకాన్ని కొనడానికి అభ్యంతరం పెట్టం -" సుబ్బారావు అన్నాడు.

" అదేదో తొందరగా చెప్పవయ్యా బాబు!" అప్పారావు ప్రాధేయపడ్డాడు.

" ఇందాక అరగుండు అప్పారావు గారు తన ఆటో గ్రాఫులతో తన కావ్యం అమ్ముతానన్నారు. దాని బదులు ఆ కావ్యం మీద డకౌట్ డబ్బారావు గారు తన అమూల్యమైన ఆటో గ్రాఫు యిస్తే నేను తీసుకుంటాను. నాతో పాటు యింకెవరైనా అలా కొంటారా?" సుబ్బారావు సభికులను అడిగాడు.

" ఓ కొంటాం - కొంటాం - డబ్బారావు సంతకం పెట్టాలి!" అంటూ సగం మంది లేచి నిలబడ్డారు.

డకౌట్ డబ్బారావు తన పాపులారిటీకి ఆశ్చర్యపోయాడు.

అరగుండు అప్పారావు రెండు కళ్ళెంబడి నీళ్ళుకారాయి. ఒకటి తన దుస్థితికి - తన సంతకం దుస్థితికి అయితే - ఇంకోటి డకౌట్ డబ్బారావుకు ఉన్న క్రేజు గురించి, ప్రజలకు క్రికెట్ పట్ల వున్న మోజుగురించి.

డకౌట్ డబ్బారావు విజయదరహాసంతో బ్యాట్‌ను గాల్లోకి ఊపాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, కాదు మ్యాన్ ఆఫ్ ది డే, కవిగారు కాదు - క్రికెటరే అని అతని కనిపించింది. తన మిత్రుడు దురవస్థకు కించిత్తు చింతించి మైకు అందుకున్నాడు.

" సారీ, ఆంధ్రా కవి అంధకారంలోనే బతుకుతున్నాడు. కలకాలం నిలిచి పోయే కవితలు అతనివి ! తాత్కాలిక ఆనందం కలిగించే ఇన్నింగ్సు నావి - కాని మీ ఓటు నాకే కాబట్టి - నా బాల్య మిత్రుడు కోసం నేను ఎంతటి త్యాగానికైనా సిద్ధమే !" అంటూ డకౌట్ డబ్బారావు ప్రకటించాడు - అంటూ సుబ్బారావు జేబులోంచి పెన్ను లాక్కున్నాడు.


కాసేపటికే అప్పారావు తెచ్చిన పుస్తకాలన్నీ మాయమై పోయాయి. ఆ తొక్కిడిని ఆపడానికి కార్యదర్శులు - పోలీసులు కష్టపడాల్సి వచ్చింది.

అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి కర్రా నరసింహులు సుబ్బారావు తెలివితేటలకు ఆశ్చర్యపోయారు.

డకౌట్ డబ్బారావుకే ఇంత ఇన్‌ఫ్లుయన్సు ప్రజలమీద ఉంటే - ఇంక రికార్డులు సృష్టించే క్రికెటర్లకు ఎంత ఇన్‌ఫ్లుయన్స్ ఉంటుందని ఆలోచనలో పడ్డాడు అప్పారావు. తను అనవసరంగా క్రికెట్ మానుకుని ఈ కిరికిరి కవిత్వం రాస్తున్నాడు. తను సాధించింది ఏముంది కనుక? ఇదే డబ్బారావు అయితే గవర్నమెంటు నుండి ఫ్రీగా ఫ్లాట్లు - ప్లాట్లు - మెడల్సు - స్పాన్సర్ల నుండి కోట్లు దండుకున్నాడు. ఇంక అతను రిటైరయినా అతని వారసులు పది తరాల దాకా దిగులు పడనక్కరలేదు.

తను ఇన్ని వేలు తగలేసి కావ్యం వెలుగులోకి తెచ్చినా... ఆవిష్కరణకు కొన్ని వేలు తగలేసినా ఎవరికీ చీమకుట్టినట్టు కూడ లేదు. చేతి చమురు భాగోతం తెలుగు కవిది.

ఎవరో సెల్‌లోని ఆడియోరికార్డర్ ఆన్ చేశారు " కాకినైనా కాకపోతిని రామభద్రుని చేరగా" అని పాట వినిపిస్తున్నది. 'హా ! క్రికెటర్నయినా కాక పోతిని' అని నిట్టూర్చాడు కవి అరగుండు అప్పారావు. పాపం ! అతను తెల్గు కవి గదా మరి !



నీ తమ్ముడు లేబొరేటరీ పెట్టాడు బాగానే వుంది!
నా బోణీ కోసం, రోజూ నన్ను యమ్.ఆర్.ఐ స్కానింగ్ తీసుకోరండీ అంటే ఎలా..!?
ఏవిఎమ్.





మీ వూరి బ్రాంచి లో, ఎరువులు ఐపోయినవి! హాట్లు రండి ఇస్తాం!
సెల్ ఫోన్‌తో ఎరువుల సమాచారం
ఆంధ్రా
AVM




మీ ఇష్టం! నన్ను ఎంత కొట్టినా కాదన్ను!
స్కూలు బయటకు వస్తారుగా! అప్పుడు చూపిస్తా నా పవరు!
AVM


నాకు శుచీ శుభ్రం ఎక్కువ.. నువ్వు ఇంట్లో అన్నీ తాకరాదు!
నువ్వు నా పెద్దమ్మ కూతురువి.. తెల్సా! ఆఫీసర్ని చేసుకోగానే ఏం స్టయిల్ పోతున్నావే!?
AVM


ఈ హెల్మెట్లు వల్ల, దొంగ మన ఎదురుగా పారి పోతున్నా పట్టుకోలేని పరిస్థితి...
AVM


విజయవాడకు మాత్రం తుఫాన్ తాకిడి లేదని చెప్పండీ మహా ప్రభో! తుఫాన్ అని మీరు చెప్పగానే.. కూతురు, అల్లుడు వాళ్ళ ఫామిలీ అంతా మా ఇంట్లోనే!
వాతావరణ కేంద్రం
AVM